

పరిహారం కోసం ఎదురుచూపులు..



- జిల్లాలో నేలరాలిన 3713 ఎకరాల మామిడి
- 862 ఎకరాల్లో నీట మునిగిన వరి పంటలు
- 45 రోజులు దాటినా పైసా విదిల్చని ప్రభుత్వం
- నష్టం అంచనా రిపోర్టు తయారీలో జాప్యం
- వానాకాలం ప్రారంభమైనా అందని నష్టపరిహారం



భీమారం మండలంలో నేలవాలిన వరి పంట (ఫైల్)

మంచిర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యం కారణంగా అన్నదాతకు ఎనలేని నష్టం వాటిల్లగా ప్రభుత్వపరం సాయం అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పెద్ద మొత్తంలో పంట నీటి పాలుకావడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఆందోళనకు గురవుతున్నారు. వేలకు వేలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికందే సమయంలో నీట మునగడంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మామిడి, వరి పంటలకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. అకాల వర్షాల కారణంగా కోత దశకు వచ్చిన వరి పంట పూర్తిగా నీటిపాలు కాగా, మామిడి నేలరాలి రైతులకు తీరని నష్టం మిగిలింది.

జిల్లాలో 4,574 ఎకరాల్లో పంట నష్టం...

భారీగా కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వరి, మామిడి కలిపి మొత్తం 4574 ఎకరాల్లో పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఇందులో 490మంది రైతులకు చెందిన వరి పంట 862 ఎకరాల్లో వరి నీట మునగగా, 3713 ఎకరాల మామిడి పంటను రైతులు కోల్పోయారు. అకాల వరాల కారణంగా ప్రధానంగా నెన్నెల, భీమారం మండలాల్లో విపరీతమైన నష్టం వాటిల్లింది. నెన్నెల మండలంలోని 345 రైతులకు చెందిన 462ఎకరాల వరిపంట నీటిపాలుకాగా భీమారం మండలంలో 145మంది రైతులకు చెందిన 400ఎకరాల పంట నీట మునిగింది. అలాగే మే 1న కురిసిన వర్షానికి నెన్నెల మండలంలో 174 ఎకరాల వరిపంట నీటిపాలైంది. మండలంలోని ఆవడం గ్రామంలో 60 మంది రైతులకు చెందిన 50 ఎకరాలు నీటిపాలుకాగా, చిత్తాపూర్ గ్రామంలో 30 మందికి చెందిన 20ఎకరాలు, పొటియాలలో 39 మందికి చెందిన 30 ఎకరాలు, చిన్న వెంకటాపూర్‌లో 20 మందికి 20ఎకరాల్లో, నెన్నెలలో ఇద్దరికి చెందిన 7 ఎకరాలు, నర్వాయిపేటలో 7గురికిచెందిన 12 ఎకరాలు, గుండ్ల సోమారంలో 4గురికి చెందిన 15 ఎకరాలు, గొల్లపల్లిలో 7గురికి చెందిన 10ఎకరాలు, మైలారంలో 7గురికి చెందిన 10ఎకరాల్లో వరిపంట ధ్వంస మైంది. ఇదిలా ఉండగా ఏప్రిల్ 30నుంచి మే 6వ తేదీ వరకు కురిసిన వర్షాల కారణంగా పలు మండలాల్లోని 3713 ఎకరాల మామిడి నేలరాలింది. నెన్నెల మండలంలో 762మంది రైతులకు చెందిన 1763 ఎకరాల్లో మామిడి నేలరాలగా, జైపూర్ మండలంలో 113 మందికి చెందిన 330ఎకరాలు, భీమారం మండలంలో 592మందికి చెందిన 1215ఎకరాలు, బెల్లంపల్లి మండలంలో 185 మందికి చెందిన 222ఎకరాలు, తాండూరు మండలంలో 132మందికి చెందిన 103 ఎకరాలు, మందమర్రి మండలంలో 30మందికి చెందిన 80ఎకరాల్లో మామిడి నేల రాలింది.

లక్షలు వెచ్చించి పంట సాగు...

భారీ వర్షాల కారణంగా జిల్లాలోని రైతులకు తీరని నష్టమే వాటిల్లింది. వరి సాగు సమయంలో ఎకరాకు రూ. 40వేలు వెచ్చించినట్లు రైతులు తెలిపారు. భూములు దున్నడం మొదలుకొని విత్తనాలు వేయడం ఎరువులు, కలుపు తీయడం, కూలీలకు లక్షలు వెచ్చించారు. సీజన్‌లో వరి, మామిడి.. (తరువాయి 7లో)

మంత్రి వివేక్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు



మంత్రి వివేక్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్15 (ఆంధ్రజ్యోతి): కార్మికఉపాధి, గనులశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్‌వెంకటస్వామిని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలోగల మంత్రి వివేక్ నివాసంలో కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మంత్రితో కలెక్టర్ చర్చించారు.

నూతన గనుల ఏర్పాటుకు కృషి చేస్తా



మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అతి పెద్ద పరిశ్రమ అయిన సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటు పడుతూనే నూతన గనుల ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్రకార్మిక, ఉపాధి కల్పన గనులశాఖమంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మందమర్రిలో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ నూతన గనుల ఏర్పాటుతోనే ఉపాధి అవకాశాలు సాధ్యమని చెప్పారు. ఒరిస్సాలో ఏ విధంగా టెండరు ద్వారా గనులు దక్కించుకున్నారో అలాగే గనులను దక్కించుకోవాలన్నారు. దీంతో సింగరేణిసంస్థకు లాభమన్నారు. దీనిపై సీఎంతో మాట్లాడుతానని తెలిపారు. కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటాన న్నారు. అంతేకాకుండా సింగరేణి ఆర్థిక ప్రగతికి ప్రణాళికలు రూపొంది స్తానన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

బెల్లంపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సీపీఐ 4వ మహాసభలను ఈనెల 21, 22న నిర్వహిస్తున్నామని నాయకులందరూ సభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని నాయకులందరూ మహాసభలకు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఐక్యతను చాటుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార మే ఏజెండాగ మహాసభలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖర్, రాజమౌళి, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే 'కాళేశ్వరం' నిర్మించారు

- మంత్రి వివేక్‌వెంకటస్వామి



ఇందిరమ్మ ఇళ్ల ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిరూరల్, జూన్15 (ఆంధ్రజ్యోతి) : కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని రాష్ట్ర ఉపాధికల్పన, గనులశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సండ్రోన్‌పల్లి, సారంగపల్లి గ్రామాల్లో పలుకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆనాటి సీఎం కేసీఆర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాదని కమీషన్‌ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షకోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే 55 ఎకరాలకు నీరందేద న్నారు. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పక్కన బెట్టిందని మండిపడ్డారు. అర్హులైన పేదలందరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటిని అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని, పేద విద్యార్థుల ను ప్రభుత్వ పాఠశాలల్లో వారికి నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. అనంతరం సారంగపల్లి గ్రామంలో ఇందిర మ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే సం డ్రోన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అలాగే రైతుబీమా చెక్కులను పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 2500 విద్యార్థులను చేర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సీ వెంకట్రావు, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్, మండల ప్రత్యేకాధికారి అనిత, ఏవో కిరణ్మయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్, చిర్రకుంట మాజీ సర్పంచు కొమురయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాలు విఫలం

- ఆపరేషన్ కగార్ నిలిపి చర్చలు జరుపాలి...
- నస్పూర్ మహాసభలో చాడ వెంకట్‌రెడ్డి



మహాసభల్లో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

నస్పూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాల పథకాల అమలులో విఫలం చెందాయని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. సీపీఐ నస్పూర్ మండల 3వ మహా సభ స్థానిక నర్సయ్య భవన్‌లో ఆదివారం జరిగింది. అంతకు ముందు గోదావరి కాలనీ షిర్కే సెంటర్ నుంచి నస్పూర్ కాలనీ మీదుగా సీసీసీ కార్నర్ సమీపంలోని నర్సయ్య భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నర్సయ్య భవన్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమర వీరులకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన మహాసభ సమావేశంలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాలను మరిచి పాలన సాగిస్తు న్నాయన్నారు. అలాగే రాష్ట్ర మహాసభలు ఆగస్టు నెలలో మెద్చల్‌లో 22, 23 తేదీల్లో జరుగుతాయన్నారు. జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్రం చండీ ఘడ్‌లో సెప్టెంబర్‌లో జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరే షన్‌ను వెంటనే ఆపి వేసి చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కా ర్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపల్ కా ర్పొరేషన్‌లో అన్ని స్థానాలకు అభ్యర్థులను నిలబెడతామని, నస్పూర్ ప్రాం తంలోనే ప్రజలందరూ ఆదరించాలని కోరారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు ఆహ్వాన సంఘం అధ్యక్షులు మేకల దాసు, నస్పూర్ కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, వీరభద్రయ్య, రవి, సమ్మయ్య, బాజీసైదా, చంద్రకళ, కొమురయ్య, ఎండీ అఫ్రోజ్, దొడ్డిపల్లి రవీందర్, మొగిలి లక్ష్మణ్, పాల్గొన్నారు.

డబుల్ రోడ్డున్నా... సింగిల్ బస్సు రాదాయె..

- రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- మహాలక్ష్మి పథకం అందడం లేదంటున్న మహిళలు



భీమిని గ్రామంలో డబుల్ రోడ్డు

భీమిని, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకం ఒకటి. ఈ పథకం కింద మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా చార్జీలు లేకుండా జీరో టికెట్‌తో మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ పథకానికి కూడా మహిళల్లో పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. ఇంత వరకు బాగానే ఉన్నా బెల్లంపల్లి నియోజకవర్గంలోని భీమిని మండల కేంద్రానికి, గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బుస్సు సౌకర్యం లేదు. మండలంలోని ప్రజలు బెల్లంపల్లి తదితర పట్టణాలకు వెళ్లాలంటే ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో వెళ్లి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలకు మహాలక్ష్మి పథకం అందని ద్రాక్షగానే మిగిలింది.

రోడ్డు సౌకర్యం ఉన్నా..ప్రైవేటు వాహనాలే దిక్కు.

మండలంలో అన్ని గ్రామాల్లో రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం మాత్రం లేదు. మండల కేంద్రంలో జూనియర్ కళాశాలలు లేకపోవడంతో బెల్లంపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ తదితర పట్టణాలకు ఉన్నత చదువుల కోసం విద్యార్థులు వెళ్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత చదువుల కోసం చిన్నగుడిపేట, పెద్దగుడిపేట, కేస్లాపూర్, ఖర్జీభీంపూర్, అక్కలపల్లి, వడాల గ్రామాల్లో ఉన్న విద్యార్థులు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఆటోలలో కళాశాలలకు వెళ్లాలంటే ప్రతీ నిత్యం రాను పోనూ రూ. 80 రూపాయల వరకు ఖర్చు అవుతుందన్నారు. రెండేళ్ల క్రితం వరకు బస్సులు బెల్లంపల్లికి నడిచేవి మహాలక్ష్మి పథకం అమలు అవుతున్నప్పటికీ ఆర్టీసీ బస్సులు మండల కేంద్రానికి రావడం లేదు. దీంతో వారు ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సి వస్తోంది.

అధికారులకు విన్నవించినా..

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని మండల వాసులు గతంతో అధికారులకు, నాయకులకు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదు. ఇటీవల బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల డిపో మేనేజర్‌కు వినతి పత్రం కూడా అందించారు. గతంలో కూడా అన్నీ సర్వసభ్య సమావేశాల్లో అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజా ప్రతినిధులు సభల్లో దృష్టికి తీసుకొని వచ్చి పలుసార్లు తీర్మాణాలు చేసినప్పటికీ ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ..



\- మడే భాను, రాజారం

మా గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులు రావడం లేదు. బస్సులు రాకపోవడంతో ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో వె ళ్తున్నాం. సాయంత్రం, రాత్రి సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

మహాలక్ష్మి పథకానికి దూరమే..



\- పుల్లూరి గాయత్రి ఇంటర్ విద్యార్థి, చిన్నగుడిపేట

మా మండలానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో మహాలక్ష్మి పథకానికి దూరం అవుతున్నాం. ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఆటోలకు చార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. బస్సు ఎక్కాలంటే ఆ టోలో బెల్లంపల్లి వరకు వెళ్లి ఉచిత బస్సు ఎక్కాలి.

బస్సు సౌకర్యం కల్పిస్తాం...

\- శ్రీనివాస్ మంచిర్యాల ఆర్టీసీ ఎండీ

భీమిని మండలంలోని గ్రామాల్లో రోడ్లను పరిశీలించి బస్సు సౌకర్యం కల్పించే విషయంలో తగు చర్యలు తీసుకుంటాము. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం అందేలా చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించా లన్నదే మా లక్ష్యం ప్రజలు ఆర్టీసీ బస్సు ప్రయాణం సద్వినియోగించుకోవాలి.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ కోల్‌బెల్ట్ కార్యదర్శి డి. బ్రహ్మానందం మాట్లాడుతూ, కేంద్రబలగాలు దండకారణ్య ప్రాంతంలో ఆపరేషన్ కగార్ పేరిట జరుపుతున్న హత్యాకాండను ఆపాలని డిమాండ్ చేశారు. ఇటీవల కర్రె గుట్టలను చుట్టు ముట్టి 31మంది మందిని ఎన్‌కౌంటం పేరిట కాల్చి చంపడం దారుణమ న్నారు. మావోయిస్టు కార్యదర్శి నంబాల కేశవరావును పట్టుకొని చంపడ మే కాకుండా అతని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం దుర్మార్గమన్నారు. చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ పేర్కొంటున్నా, కేంద్ర ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేయకపోవడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రామయ్య, గడ్డె మల్లేష్, పోతుల కిష్టయ్య, భూపతి యాదగిరి, కొదురుపాక సదానందం, పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వ్యాపారులు

లక్షెట్టిపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట బస్టాండ్ వద్ద కూరగాయల వ్యాపారులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆదివారం రాస్తారోకో చేపట్టారు. లక్షెట్టిపేటలో కూరగాయల వ్యాపారులకు సరైన స్థలంలేక నానా అవస్థలు పడుతున్నామమని రోడ్డుపై ఉన్న వ్యాపార సముదాయాలు తొలగించే ప్రయత్నం చేస్తున్న అధికారులు ముందుగా స్థలం చూపించాలని డిమాండ్ చేసారు. మున్సిపాలిటీలో సరైనకూరగాయల మార్కెట్ లేకపోవడంతో పల్లెల నుంచి వచ్చిన చిరువ్యాపారులు ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు పెట్టుకోవడంతో వ్యాపారాలు కూడా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. లక్షెట్టిపేట మున్సిపాలిటీకి ఒక సంత సరిపోతుందని కానీ రెండు సంతలతో వ్యాపారాలు సాగడం లేదని అధికారులు చొరవ తీసుకుని ఏదైన ఒక సంతను మాత్రమే కొనసాగించాలని డిమాండ్ చేసారు. రాస్తారోకో సమాచారం తెలుసుకున్న పోలీసులు వచ్చి వ్యాపారులను సముదాయించడంతో వ్యాపారులు శాంతించారు. ఈకార్యక్రమంలో సుమారు వంద మంది చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీల కార్యవర్గం



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

లక్షెట్టిపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని ఆర్ఎంపీల కార్యాలయంలో మంచిర్యాల జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా మేడిపల్లి విజయ్, జిల్లా ఉపాధ్యక్షులుగా సలేంద్ర రాముచారి, అనుమాండ్ల రాంచందర్, జనరల్ సెక్రటరీగా ఎగుడ రాయమల్లు, జిల్లా అధికార ప్రతినిధి దొంతుల మొండయ్య, కోశాధికారిగా రాజేందర్, జాయింట్ సెక్రటరీగా కొయ్యల రాజు, చంద్రశేఖర్, ప్రచార కార్యదర్శులుగా రమేష్, సత్యనారాయణలను ఎన్నుకున్నారు. వీరికి సలహాదారుగా కుంచాల శంకరయ్య, గౌరవ అధ్యక్షులుగా బెంజిమెన్, కార్యనిర్వహణ అధ్యక్షుడిగా కొప్పుల లక్ష్మన్‌ను నియమించుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను ఘనంగా శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈఎన్నికలు జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల సమక్షంలో నిర్వహించారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లక్షెట్టిపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీనాయకులు ఆదివారం ప్రొసిడింగ్స్ పంపిణీ చేసారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడు తూ గత ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు పంపిణీ చేస్తానని మాట ఇచ్చి మన ప్రాంతంలో ఒక్కరికి కూడా ఇవ్వలేకపోయిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాట ప్రకారం నిరుపేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లను మంజూరు చేసే విధంగా గ్రామస్థాయి నాయకులు చొరవ తీసుకుంటారన్నారు. ఎవరూ నిరశా పడకూడదని నాయకులు వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పూర్ణచందర్‌రావు, చింత అశోక్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్, పాలకుర్తి బుచ్చయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొప్పు సుమన్, నాయకులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దండేపల్లి జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ నేరేండుల శ్రీనివాస్, సహాయ కో ఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్‌రావులు ఆదివారం ఓ ప్రకటలో కోరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులతో పాఠశాల, కళాశాలకు వెళ్లిచదువుకోవడం వీలుకాని వారు 14 ఏళ్లు నిండితే నేరుగా ఓపెన్ స్కూల్‌లో పదవతరగతి చదువుకోని పరీక్ష రాయవచ్చని అన్నారు. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా జూలై 11వ తేదీలోపు అభ్యాసకులు ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకొరకు 8309769067 సెల్‌ఫోన్‌లో సంప్రదించాలన్నారు.



వర్షాకాలం.. పాముల భయం

● పొంచి ఉన్న సర్పాల గండం
● పల్లెలు, పంట పొలాల్లో భద్రం
● అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

ఆసిఫాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లాలో విషసర్పాల బెడద ఎక్కువగానే ఉంది. ఏటా పాము కాటులో పదుల సంఖ్యలో మృత్యువాతప డుతున్నారు. జూన్, జూలై నెలల్లో పాములు తమ ఆవాసాలను విడిచి బయటకు వస్తుంటాయి. ఈ క్రమంలో పొలం పనులకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి. బొరియల్లో ఉండే పాములు ఆహారాన్వేషణలో పొలం గట్లు, పొదల వెంట సంచరిస్తుంటాయి. ఇది గమనించక పలువురు పాము కాటుకు గురవుతున్నారు. జిల్లాలో విషసర్పాల సంఖ్య చాలా తక్కువ. కాటు వేసిన పాము విష పూర్తిమైందో కాదో ముందు తెలుసుకోవాలి. పాము కాటు వేసవిన చోట కట్టుకట్టి ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఎలాంటి పాము కాటు వేసి నా వెంటనే ఆసుపత్రికి తీసుకేళ్తే 99శాతం బతికించే అవకాశ ముంది.

సర్పాల రకాలు, విష ప్రభావం ఇలా..

విష సర్పాలు రెండు రకాలు ఉంటాయి. న్యూరోటాక్సిల్ రకం నాగు పాము, కట్ల పాము, రెండో రకం హిమోటాక్సిన్ అంటే రక్తపించర పాము వంటి పాములు ఉంటాయి. న్యూరోటాక్సిల్‌తో నోటి ద్వారా నురుగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపి నాడీ వ్యవస్థను దెబ్బతీస్తుంది. హిమోటాక్సిన్‌తో రక్తనాళాల కణాల్లో కణజాలం నశించి కాటు పడిన భాగంలో వాపు వస్తుంది.

● జిల్లాలోని ఆసుపత్రుల్లో..

జిల్లాలోని 20 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు, రెండు అర్బన్‌హెల్త్ సెంటర్‌లల్లో పాము కాటు మందులు అందుబాటులో ఉన్నాయి. ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో సంప్రదించే అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే ఏరియా ఆసుపత్రులకు తరలించి కృత్రిమ శ్వాసను అందించి బతికించే అవకావం ఉంటుంది. ఆందోళనకు గురై ఆలస్యం చేస్తే పమాద కరంగా మారు అవకాశం ఉంటుంది.



ఆందోళనకు గురి కావొద్దు..

పాము కాటుకు గురైనప్పుడు ఆందోళణకు గురి కావద్దు. ఇది గుండె పోటుకు దారి తీస్తుంది. ప్రాథమిక చర్యగా కాటు వేసి ప్రదేశంపై భాగంలో కట్టు కట్టాలి. ఆ వెంటనే చికిత్స కోసం వెళ్లాలి. పాము కాటుకు గురైన వారు ఆసుపత్రికి వెళ్లి స్పష్టంగా చెప్తే దానికి సంబంధించిన చికిత్స చేస్తారు. అక్కడ యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్ అందుబాటులో ఉంటాయి. రక్తం గడ్డ కట్టే అవకాశం ఉంటే దానికి ఈ ఇంజన్ పని చేస్తుంది. గుండె పోటు రాకుండా ఈ మందు ఉపకరిస్తుంది. రెండో రకం నరాలపై పని చేసి మెదడుపై ప్రభావం చూపి మృతి చెందడానికి అవకాశం ఉంటుంది.

● విషకీటకాల బారిన పడకుండా..

సాధ్యమైనంత వరకు పాములు విష కీటకాల బారిన పడకుండా ఉండాలి. రాత్రి పూట పొలాల వద్ద వెళ్లే వారు కర్ర, టార్చ్ లైటు తీసుకెళ్లాలి. కప్పలు, ఎలుకలు ఉన్న చోట పాములు సంచరిస్తుంటాయి. ఇంటి ఆవరణలో కంప చెట్లు, పిచ్చి మొక్కలు, రంధ్రాలు, నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తగా చూసుకోవాలి. ఇళ్లలో ఎలుకలు ఉంటే పాములు వస్తాయి. చిన్నారులు రాళ్లు, చెట్ల పొదల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. రాత్రిపూట పొలాలకు వెళ్లేవారు సాధ్యమైనంత వరకు పొడవాటి బూట్లు ధరించడం ఎంతో మంచిది. కట్ల పాము కాటేసిన క్షణాల్లో విషం రక్తంలోకి ప్రవేశించి మృతి చెందే అవకాశం ఉంటుంది. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఆందోళనకు గురి కాకుండా వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలి. నాగు పాము కాటేసిన 15నిమిషాల్లో విషం ఎక్కుతుంది. రక్తపింజర కాటేసిన రెండు గంటల తరువాత విషం కక్కుతుంది. జెర్రిపోతు, సిరుకట్ల పాము కాటేసినా విషం ఉండదు. ఏ కీటకం బారినపడిన ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

కాటేసింది ఎలాంటి పాము తెలుసుకుంటే చికిత్స చాలా సులభం. పక్క పక్కన రెండు దంతాలు కాటే వేస్తే అది ఖచ్చితంగా విష సర్పమే. పాము కాటుతో ఉన్న భాగం నుంచి శరీరంలోకి రక్త ప్రసరణలో విషం వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఎటువంటి పాము కాటే వేసినా ఆసుపత్రికి వెళ్తె రెండు రకాల చికిత్సలు నిర్వహిస్తారు తీవ్రతను బట్టి ఇంజక్షన్ వేస్తారు. యాంటీ స్నేక్ వీనం, యాంటీ పాలి వీనం అనే రెండు రకాల మందులు ఉంటాయి. ప్రస్తుతం మన జిల్లాలో అన్ని ఆసుపత్రుల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి.

జీవో 49ని ఉపసంహరించుకోవాలి

ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



జీవో 49 ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కుమరం భీం జిల్లాను టైగర్ కన్జర్వేషన్‌గా ప్రకటిస్తూ విడుదల చేసిన జీవో 49ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు డిమాండ్ చేశారు. కాగజ్‌నగరలో ఆదివారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు జీవో ప్రతులను దహనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. జీవో49 విడుదల కోసం ఈ ప్రాంత అటవీ శాఖ అధికారులు వివిధ గ్రామాల్లో గ్రామసభలు పెట్టినట్టు ఉన్నతాధికారులకు నివేదికలివ్వడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కనీసం ఎమ్మెల్యేగా ఉన్న తనకే ఎలాంటి సమాచారం ఇవ్వలేదన్నారు. అటవీ శాఖ అధికారులు ఇప్పటికైనా ఇలాంటివి మానుకోవాలన్నారు. ప్రస్తుతం ఎలాంటి నిబంధనలు లేకున్నప్పటికీ అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారని అన్నారు. జీవో49 అమలు జరిగితే ఈ ప్రాంతం పూర్తిగా కుంటుపడి పోతుందన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లు కనీసం మరమ్మతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయలేని పరిస్థితి వచ్చిందన్నారు. తాగునీటి ఇబ్బందులు ఉన్న చోట్ల కనీసం బోరింగ్ కూడా వేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోను విరమించుకునే వరకు పోరాటం చేస్తామన్నారు. అన్ని సంఘాల మద్దతుతో మరింత ఉధృతంగా చేస్తామని చెప్పారు. పెంచికల్‌పేట అటవీ ప్రాంతంలో పులిని చంపిన కేసులో బడా వ్యక్తిని అటవీ శాఖ అధికారులు వదిలేసి చిన్నవారిపై కేసులు నమోదు చేశారని అన్నారు. గతంలో ఉన్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క గిరిజనుల కోసం ఏం చేశారని ప్రశ్నించారు. జీవో 49ని వెంటనే రద్దు చేసేలా చూడాలని కోరారు. ఆదివాసీల హక్కులకు భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు శివ, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, మాజీ ఎంపీటీసీ గణపతి, నాయకులు తిరుపతి, గజ్జల లక్ష్మణ్, తిరుపతిగౌడ్, మహేష్, చిలుకయ్య పాల్గొన్నారు.

దాడికి పాల్పడ్డ నిందితులను శిక్షించాలి

దండేపల్లిలో కొండాపూర్ గ్రామస్థుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న కొండాపూర్ గ్రామస్థులు

దండేపల్లి జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం కొండాపూర్‌లో ఇంటి పెరడి విషయంలో భారతరపు సత్తవ్వ ఆమె మరిది ప్రభాకర్(గ్రామ కారోబార్) లపై ఇంటి పక్కన ఉన్న వారు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. దండేపల్లిలో ప్రధాన రహదారిపై ఆదివారం కొండాపూర్ గ్రామస్థులు బాధితులకు మద్దతుగా రాస్తారోకో చేపట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతవరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొండాపూర్‌లో రత్నాకర్, భారతరపు కుమారస్వామిలకు భూ తగాదా విషయంలో కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో శనివారం ఇంటి పక్కన ఉన్న కుమారస్వామి, అతని తండ్రి లింగయ్యతో పాటు వారి కుటుంబసభ్యులు సత్తవ్వ ప్రబాకర్ పైనా దాడికి పాల్పడ్డారు. వారు తీవ్రంగా గాయపడడంతో చుట్టుపక్కల వారు వచ్చి వారిని ఆసుపత్రికి తరలించారు. నింది తులను కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆందోళన అనంతరం గ్రామస్థులు స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడా ఉద్రిక్తత చోటుచేసు కుంది. ఈవిషయం తెలుసుకున్న లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై ఎండి తహసీనోద్దీన్ పోలీసుస్టేషన్‌కు చేరుకోని కొండాపూర్ గ్రామ నాయకులు, మహి ళలతో మాట్లాడారు. నిందితులపై కేసు నమోదు చేశామని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామని, బాధితులకు సరైన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం తో వారు ఆందోళన విరమించారు.

మందుల కొరత.. సేవలకు కలత

» పెద్దాసుపత్రిలో అందని వైద్యం
» కార్మికుల అవస్థలు

రామకృష్ణాపూర్ జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి విస్తరించి ఉన్న అన్ని ఏరియాలలో కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రిలలో సరైన వైద్య సేవలు, రోగులకు అందిచాల్సిన మందులు లేక కార్మికుల పాలిట శాపంగా మారాయి. అన్ని రోగాలకు చికిత్స ఒకటే మందు గోలిలు ఉన్నాయి అనే సంద్రంగా మారాయి. ఒక్కప్పుడు సింగరేణిలో గని ప్రమాదాలు జరిగితే, పెద్ద జబ్బులు వస్తే సింగరేణి ఆసుపత్రిలో మంచి వైద్యం అందిస్తారనే ఒక నమ్మకంగా ఉండేది. అలాంటి ఆసుపత్రులు నేడు సరైన వైద్యులు, వైద్య సేవలు జబ్బులకు మందులు లేక ప్రథమ చికి త్సలు అందించేందుకు మాత్రమే ఆసుపత్రులు ఉన్నాయనే పరిస్థితి నెలకొంది. రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మందులు కొరత కాణంగా నిత్యం పెద్ద సంఖ్యలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులకు మేరుగైన వైద్య సేవలు అందించేందుకు సంస్థ కార్మికుల సంక్షేమంలో బాగంగా 1986లో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో వైద్యసేవలు అంతంతే మాత్రంగా అందుతున్నాయి. అంతే కాకుండా రోగాల బారిన పడిన కార్మికులు చికిత్సలు అందించేందుకు సరైన మందులు ఇవ్వడం లేదని కార్మికులు వాపోతున్నారు. రోగం ఏదైన మందు ఒకటనే సంద్రాన ఆసుపత్రికి వచ్చే రోగులకు పారాసిట్మాల్, బి కాంప్లేక్స్ మందులు అందిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాలైన బీపీ, షుగర్, థైరాయిడ్, ముత్రపిండాల, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడిన రోగులకు అందించాల్సిన మందులు కొంత కాలంగా సరఫరా లేక ఉన్న మందులతోనే సంస్థ సరిపెడుతుందని కార్మిక కుటంబాలు పేర్కోంటున్నారు. సింగరేణి వ్యాప్తంగా మందుల కొరత ఉన్న విషయాన్ని అధికారులు చెప్పకనే చెబుతున్నారని కార్మిక కుటుంబాలు యాజమాన్య తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. రిటైర్డు కార్మికులకు నెలకు సరిపడా మందులు అందక ఇబ్బందులు పడుతున్నారని కార్మికులు వాపోతున్నారు.

సింగరేణి వ్యాప్తంగా..

సింగరేణి వ్యాప్తంగా మొత్తం 43వేల మంది కార్మికులు 40వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచే స్తున్నారు. శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ఏరియాలలో దాదాపు 22వేల మంది కార్మికులు ఉన్నారు. గనులలో ప్రమాదాలు జగిరినప్పుడు, ఇతర్రాత ఆనారోగ్య సమస్యలు కార్మికులు వారి కుటుంబ సభ్యులు గురైన ప్పుడు చికిత్సల కోసం ప్రధానంగా రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందించాల్సి ఉంది. కానీ ఇక్కడ సరైన వైద్యం అందడం లేదని అంతే కాకుడండా ఆసుపత్రిలో చేరిన రోగులకు మందులు అందుబాటులో లేక పోవ డంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నా రు. సింగరే ణిలో 170 మంది వైద్య సిబ్బంది, స్పేషలిస్టు వైద్యులు పనిచేస్తున్నప్పటికి ఎక్కడ కూడ పూర్తి స్థాయిలో వైద్యం అందడం లేదనే ఆరోపనలు ఉన్నాయి. సంస్థ ఏటా కార్మికుల సంక్షేమంలో భాగంగా వైద్యం, ఆసుపత్రుల నిర్వహణకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నది. మెరుగైన సేవల కోసం మాత్రం కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని చెబుతున్నారు.



రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి

ఏరియా ఆసుపత్రిలో..

రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో గత కొంత కాలంగా ఈఎన్‌టీ, గుండె సంబంధిత, రేడియాలజీస్ట్, ఫిజియోథేరపి డెంటిస్ట్, పిల్లల వైద్యులతో పాటు పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రేడియాలజీస్ట్ లేక పోవడం కారణంగా గైనకాలజీకి సంబంధించిన స్కానింగ్‌లన్ని ప్రయివేట్ స్కానింగ్‌ల లో చేయించుకోవాలని సింగరేణి ఆసుపత్రి వైద్యులే సూచించడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా చిన్న పిల్లల వైద్యులు లేక మహిళలు సిజేరియన్ తర్వాత పుట్టిన పిల్లలను ప్రయివేట్ ఆసుపత్రిలలో చూపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులకు స్కానింగ్ విషయంలో ప్రయివేట్ ఆసుపత్రిలో చేయించాలని సూచించడంపై కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై డీవై సీఎంఓ ప్రసన్నకు మార్‌ను వివరణ కోరగా కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. మందుల కొరత అనేది ఆసుపత్రిలో లేదని, వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.



ప్రధానంగా మందుల కొరత..

సింగరేణిలో ప్రధానంగా మందుల కొరత ఉంది. రోగానికి సంబంధించిన మందులు అందుబాటులో లేవు. ఉన్న మందులతో రోగులకు వైద్యం అందిస్తు న్నారు. సంస్థ స్టాండెడ్ మందులు కోనుగోలు చేయాల్సి అవసరం ఉంది. కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలి.

- సాంబారు వెంకటస్వామి, సీఐటీయూ మందమర్రి అధ్యక్షుడు



పూర్తి స్థాయిలో సేవలు అందించాలి..

సింగరేణి ఆసుపత్రులలో యాజమన్యాం పూర్తి స్థాయిలో వైద్య సేవలను కార్మికులకు అందించాలి, డిప్యూటేషన్ పేరిట వైద్యసేవలు కోసం వైద్యులతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రామకృష్ణాపూర్‌లో ప్రధానంగా ఈఎస్‌టీ వైద్యం, గుండె సంబంధిత, రేడియాలజిస్ట్ విభాగంలో తక్షణమే నియమించాలి.

- ఎండి అక్బర్ అలీ, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

నకిలీ విత్తనాలు పట్టివేత



పట్టుకున్న నకిలీ విత్తనాలు

భీమారం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పోలంపల్లి శివారులో ఆదివారం నకిలీ విత్తనాలను పట్టుకున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పోలంపల్లి శివారులో నకిలీ విత్తనాలు ఉన్నాయనే సమాచారం మేరకు పోలీసులు వెళ్లడంతో అది గమనించి ఒక వ్యక్తి పాలిథిన్ కవర్ వదిలేసి పారిపోతుండగా పట్టుకున్నారు. కవర్‌లో పత్తి విత్తనాలు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సత్యనారాయణను విచారంగా తాను భీమారానికి చెందిన గుడిమల్ల శ్రీను వద్ద తీసుకున్నట్లు తెలిపాడు. మండల వ్యవసాయాధికారి సుధాకర్‌కు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పరీక్షించి గ్లైసిల్ విత్తనాలుగా గుర్తించారు.. వ్యవసా యాధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే మండ లంలోని బాల్క సుమన్ రోడ్డులో తనిఖీలు చేస్తుండగా వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని తనిఖీ చేయడంతో సంచిలో పత్తి విత్తనాలు లభించాయి. నిందితుడు భీమారానికి చెందిన అన్నవేని నర్సయ్య మహారాష్ట్ర నుంచి విత్తనాలు తీసుకువచ్చినట్లు తెలిపాడు.

సింగరేణికి పూర్వ వైభవం తీసుకొస్తాం



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య

మందమర్రి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ, పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రి పట్టణంలోని బీ1 మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు ఆయనను శాలు వాతో సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ సింగరేణిలో సంఘాలు కార్మికుల హక్కుల కోసం బాధ్యతయుతం గాపని చేయాలని అన్నారు. తమ తండ్రి నుంచి తాము ఎంతో నేర్చుకున్నామని చెప్పారు. సంస్థ ను బీఐఎఫ్ఆర్‌లోకి వెళ్లినప్పుడు దానిని కాపాడింది కాకనే అనే సంగతి మర్చిపోవద్దన్నారు. కార్మికులు విరమణ పొందితే వారి జీవన బృతికి పెన్షన్ మంజూరు చేశారని గుర్తు చేశారు. సింగరేణి కార్మికుల సొంతింటి కల అమలు చేసే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడుతామన్నారు. సింగరేణికి పూర్వ వైభవం కోసం సాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉంటానని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్ని అమలు అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి మనుగడకు నూతన గనులను తీసుకు రావాలన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి కార్మికుల ఇన్కం టాక్స్ యాజమాన్యమే చెల్లించే విధంగాచూడాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కానానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్రావ్‌తో పాటు ఏఐటీయూసీ స్థానిక నాయకులు సలేంద్ర సత్యనారాయణ, బీమనాతుని సుదర్శన్, ముల్కలపెల్లి వెంకటేశ్వర్లు, ఎగ్గేటి రాజేశ్వర్‌రావు, బాబర్ సలీం పాల్గొన్నారు.

నూతన గనులను ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నూతన గనులను ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ క్రమ శిక్షణ సంఘం అధ్యక్షుడు, బెల్లంపల్లి రీజియన్ ఇన్‌చార్జి కాంపెల్లి సమ్మయ్య అన్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అధ్యక్షతన నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణిలో పనిచేస్తున్న ఉన్నత విద్యావంతులతో సింగరేణి ఆధ్వర్యంలో ఐటీ కంపెనీ ఏర్పాటు చేయాలన్నారు. డిస్మసల్ కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవాలని, కార్మికులకు గృహ వసతి కల్పించాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వారి సంక్షేమం గురించి చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి కార్మికుల కోసం హైదరాబాద్‌లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలన్నారు. 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని కోరుతూ మంత్రులకు విన్నవించామన్నారు. ఆయా సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు, గరిగె స్వామి, తిరుపతి రాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, ఐరెడ్డి తిరుపతి రెడ్డి, ల్యాగల శ్రీనివాస్, చాట్ల అశోక్, రామ్‌శెట్టి నరేందర్, చీటీ చంద్రమోహన్, మెండ వెంకటి, వీరమల్లు, తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం



పెట్టం లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన తరువాత సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి అన్నారు. టీబీజీకేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సంస్థలో అనేక సమస్యలు పేరుకుపోయాయని, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నా రు. కార్మిక సమస్యలు గాలికి ఒదిలేసి కేవలం పైరవీలకు పరిమిత మయ్యారని ఆరోపిం చారు. కార్మికుల రిఫరల్ సౌకర్యాన్ని సులభతరం చేయాలని, 2024-25 ఆర్థిక సంవత్సరం వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి 35 శాతం లాభాల వాటా పంపిణీ చేయాలని కోరారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా బండి రమేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం గతంలో ఉన్న ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరిని కలిసిన జీసీసీ చైర్మన్

దండేపల్లి జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీ వల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమారేను రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి ఆదివారం కలిశారు. మంత్రి పదవి చేపట్టి ధర్మపురికి తొలిసారి వచ్చిన సందర్భంగా ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రైలు కింద పడి ఇద్దరి మృతి

తాండూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : రేచినిరోడ్డు-బెల్లంపల్లి రైల్వేస్టేషన్ రోడ్డు రైల్వేస్టేషన్‌ల మధ్యలో ఉన్న రైలు పట్టాలపై ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు నుంచి కింద పడి ఇద్దరు వ్యక్తులు మృతిచెదినట్లు బెల్లంపల్లి రైల్వే ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మృతుల వద్ద నాగ్‌పూర్ నుంచి కాచిగూడ వెళ్తున్నట్లు రైలు టికెట్లు ఉన్నాయని, ఒక వ్యక్తి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలమధ్య ఉంటుందని, లాల్చీ పైజామా ధరించి ఉన్నాడని తెలిపారు.మరో వ్యక్తి వయస్సు 30 సంవత్సరాలు ఉంటుందని, ఫుల్ హ్యాండ్స్ వింటర్ స్వెట్టర్, మెరున్ రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్టు, గోధుమ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. వివరాలు తెలిస్తే 8712658596, 9490871784, 99493-04574లో సంప్రదించాలన్నారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ మండల కమిటీ నియామకం

నస్పూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నస్పూర్ మండల కమిటీని ఆదివారం జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మన్ ప్రకటించారు. నస్పూర్ మండల మూడవ మహాసభ నిర్వహణ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నస్పూర్ మండల కార్యదర్శిగా జోగుల మల్లయ్య, సహయ కార్యదర్శిగా లింగం రవిలను నియమించారు.

అంగన్‌వాడీకి చలో..చలో

- జిల్లాలో కొనసాగుతున్న అమ్మమాట.. అంగన్‌వాడీ బాట
- అడ్మిషన్ల కోసం ప్రత్యేక కార్యాచరణ
- పిల్లల కోసం గడప గడపకూ సిబ్బంది



మైలారంలో బడిబాట ర్యాలీలో పిల్లలతో సూపర్‌వైజ్, టీచర్లు (ఫైల్)

నెన్నెల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసి చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అమ్మమాట అంగన్‌వాడీ బాట పేరిట నూతన కార్యక్రమాన్ని చేపడుతోంది. వారం రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జిల్లాలో ఈ నెల 10న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 17 వరకు కొనుసాగుతుంది. ఇందులో భాగంగా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించి అర్హత గల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరుస్తున్నారు. సెంటర్లలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను, పౌష్టికాహారం గూర్చి పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు కోసం కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పిల్లల చేరికల కోసం గ్రామాల్లో గడపగడపకు తిరుగుతున్నారు.

● కార్యక్రమాలు ఇవే...

అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా అలంకరించి, తల్లిదండ్రులు, పిల్లలకు స్వాగతం పలకాలి. ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ లెవల్ మానిటరింగ్ సపోర్ట్ కమిటీ(ఏఎల్ఎంఎస్‌సీ)తో సమావేశాలు నిర్వహించాలి. 3ఏళ్లుపూర్తి చేసుకున్న ప్రీ స్కూల్ పాఠ్యాంశాలు, డైలీ టైమ్ టేబుల్, అందుబాటులో ఉండే వర్క్ బుక్స్, కథల పుస్తకాల గూర్చి వివరించాలి. అడ్మీషన్ల కోసం గడపగడకూ వెళ్లాలి. ప్రీస్కూల్ పూర్తి చేసిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేసి, ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రోత్సహించాలి. కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలకు అందించే పోషకా హారం గూర్చి పేరెంట్స్‌కు వివరించాలి. పిల్లలను ఆకర్షించే విధంగా కేంద్రాన్ని అలంకరించాలి. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూడాలి. సామూహిక అక్షరా భ్యాసం నిర్వహించాలి. పేరెంట్స్, గ్రాండ్‌పేరెంట్స్, గ్రామ పెద్దలను స్కూల్‌కు ఆహ్వానించాలి. టీచర్లు తయారుచేసిన టీచింగ్ మెటీ రియల్‌ను ప్రదర్శించాలి. ప్రతిరోజు స్కూల్‌కు పంపిచే పిల్లల పేరెంట్స్, ఆరోగ్యంగా ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ప్రోత్సాహక బహుమతులు అందివ్వాలి.

పిల్లలకు ఎగ్ బిర్యాణి

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన పిల్లలకు విద్యాబుద్దులు నేర్పడంతో పాటు సమతుల పౌష్టికాహారం అందజేస్తు న్నారు. ఇన్నాళ్లు ప్రతి రోజు పప్పు, కూరగాయలతో మ ధ్యాహ్న భోజనం వడ్డించేవారు. రోజుకో ఉడకబెట్టిన కో డి గుడ్డుతో పాటు మురుకులు, చిక్కీలు, బాలామృతం అందజేసేవారు. నూతన మెనూ ప్రకారం వారంలో రెండు సార్లు ఎగ్ బిర్యాణి వడ్డిస్తున్నారు. రుచికరమైన పౌష్టిక ఆహారం పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి ఉపకరిస్తుందని టీచర్లు పేర్కొన్నారు.



అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్(ఫైల్)

● జిల్లా వివరాలు

జిల్లాలో బెల్లంపల్లి, చెన్నూరు, లక్షెట్టిపేట, మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 969అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 907 మంది టీచర్లు, 716మంది ఆయాలు పని చేస్తున్నారు. జిల్లాలో 3నుంచి 4ఏళ్ల పిల్లలు 17,891 మంది, 5నుంచి 6ఏళ్ల పిల్లలు 2,579 మంది ఉన్నారు.

ప్రవేశాల సంఖ్య పెంచేందుకు కృషి..

- రవూఫ్‌ఖాన్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి



అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ప్రవేశ సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. పిల్లల నమోదు శాతాన్ని పెంచి పిల్లలకు నాన్యమైన విద్యను అందించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. ఆటపాటలతో పాటు విద్యను నేర్పడంతో పిల్లలు మానసికంగా, శారీరకంగా వృద్ధి చెందు తారు. జిల్లాలో అంగన్‌వాడీ బడిబాట విజయ వంతంగా కొనసాగుతోంది. కార్యకర్తలు, ఆయాలు ఇం టింటికీ తిరిగి పిల్లలను చేర్పేలా పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో చాలా మం ది పిల్లలను చేర్పేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులు..

(5వ పేజీ తరువాయి)

పంటలు ఆశాజనకంగా ఉండటంతో సంబంధిత రైతులు ఆనందంలో ఉన్నారు. ఆశించిన మేర పంటలు పండితే తమ కష్టాలు తీరు తాయను కున్న సమయంలో అకాల వర్షాలు వారి ఆశలపై నీళ్ల చల్లాయి. పంట మొత్తం తుడిచి పెట్టుకుపోవడంతో రెక్కల కష్టం కూడా మిగలక పోగా, సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు.

నెలలు గడుస్తున్నా....

జిల్లాలో భారీ వర్షాల కారణంగా వివిధ రకాల పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసిన అధికారులు తుది జాబితా తయారు చేయడంలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. దాదాపు రెండు నెలలు గడుస్తున్నా సంబంధిత నివేదిక ఇంతవరకు ప్రభుత్వానికి అందజేయలేదని సమాచారం. నివేదిక ప్రభుత్వానికి సకాలంలో అందితే రైతులకు పరిహారం అందించడం ద్వారా ప్రభుత్వం వారిని ఆదుకోనేందుకు అవకాశం ఉంటుంది. నివేదిక అందిన తరువాత ప్రభుత్వం పరిహారం అందజేసేందుకు మరికొంత సమయం పడుతుంది. వానాకాలం సీజన్ ఇప్పటికే ప్రారంభం కాగా, ప్రభుత్వ సాయం పెట్టుబడులకు అందితే కొంతమేర రైతులకు ఉపశమనం కలిగేది. అయితే రెండు నెలలు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాల కారణంగా రైతులు నష్ట పోయిన పంటలకు ఎకరాకు రూ. 10వేలు పరిహారం చెల్లిస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నష్టపరిహారం చేతికి అందినా కనీసం పెట్టుబడులు తిరిగొస్తాయన్న ఆశతో రైతులు ఉన్నారు.

వికలాంగులకు ప్రభుత్వం చేయూత

మంత్రి వివేక్‌వెంకటస్వామి



మంత్రిని సన్మానిస్తున్న వికలాంగులు

మందమర్రి టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తమ ప్రభుత్వం దివ్యాంగులకు చేయూతనిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంచిర్యాల జిల్లాకు చెందిన వికలాంగులు ఆదివారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రుణాలు, పెన్షన్‌లు సకాలంలో అందేలా చూస్తామన్నారు. సదరం సర్టిఫికెట్‌లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వైద్యులతో మాట్లాడుతామన్నారు. అంతే కాకుండా రోడ్డు ప్రమాదాలతో పాటు ఇతర ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన వారికి ఆయా సంస్థలతో పరికరాలు ఇప్పించేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జాతీయ నాయకుడు పెద్దపల్లి సత్యనా రాయణ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మందమర్రిటౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో ఆదివారం పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బత్తుల శ్రీనివాస్ సంఘం పట్టణాధ్యక్షుడిగా మరోసారి ఎన్నికయ్యారు. మొత్తం 482 ఓట్లు ఉండగా 392 ఓట్లు పోల య్యాయి. బత్తుల శ్రీనివాస్‌కు 262, ప్రత్యర్థి బత్తుల సతీష్‌కు 114, నాగేం దర్‌కు 11 ఓట్లు పోలయ్యాయి. 148 ఓట్లతో బత్తుల శ్రీనివాస్ గెలిచారు. ఎన్నికల పరిశీలకులుగా ఓ. రాజశేఖర్, కొక్కుల కేదారి, వెంకటేశం, వనం సత్యం, చిలగాని సుదర్శన్, సుధాకర్‌లు గెలిచిన శ్రీనివాస్‌కు నియామక పత్రం అందించారు. బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. నూతనగా ఎన్నికైన అధ్యక్షుడిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.


యువకుడి మృతదేహంతో ఆందోళన

- ముల్కల్లలో ఉద్రిక్తం
- ఏసీపీ, సీఐ జోక్యంతో సద్దుమణిగిన వివాదం

హాజీపూర్, జూన్15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటకు చెందిన దేవిప్రశాంత్(27) అనే యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ముల్కల్లలో ఉద్రిక్తతకు దారి తీసింది. గుడిపేటకు చెందిన దేవి ప్రశాంత్ బీటెక్ పూర్తి చేసి అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మూడళ్లుగా ముల్కల్లకు చెందిన ఓ వివాహితతో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. మూడు నెలల క్రితం సదరు వివాహిత కుమారుడితో కలిసి ఇద్దరు హైదరాబాద్‌కు వెళ్లారు. కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు వివాహిత తన కుమారుడిని కుటుంబ సభ్యులకు అప్పగించింది. అయినా వీరి సంబంధం కొనసాగుతోంది. వారం క్రితం మరోసారి ఇద్దరూ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. వివాహిత కుటుంబ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ప్రశాంత్ సోదరుడి సాయంతో హైదరాబాద్‌లో ఉంటున్న వారితో చర్చించగా మొదటగా వివాహిత గురువారం ఇంటికి వచ్చింది. ఈ విషయమై కేసు నమోదు కావడంతో ప్రశాంత్ ఇంటికి వెళ్లకుండా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. శనివారం ఉదయం ఉప్పల్ పోలీసుస్టేషన్ నుంచి మృతుడి సోదరుడు రాజశేఖర్‌కు ఫోన్ రావడంతో ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఉప్పల్ వెళ్లిపోయాడు. అక్కడ ఓ గదిలో విగతజీవిగా కనిపించిన ప్రసాద్ మృతదేహంతో బోరున విలపించారు. మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు వ్యక్తం చేశారు. ఆదివారం అంబులెన్స్‌లో గుడిపేటకు ప్రశాంత్ మృతదేహం తీసుకరాగా తోటి డ్రైవర్లు సంతాప సూచకంగా అంబులెన్స్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో ఊహించని విధంగా వివాహిత కుటుంబ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. దాడి ఉద్రిక్త పరిస్థితులకు దారి తీయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయినా మృతదేహంతో వివాహిత ఇంటికి వెళ్లి ధర్నా నిర్వహిస్తూ ఇంటిలోని సామగ్రిని ధ్వంసం చేశారు. మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ బారీ అక్కడకు చేరుకుని బందోబస్తును ఏర్పాటు చేశారు. ఏసీపీ వారితో వారించి ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట సీఐ రమణామూర్తి, లక్షెట్టిపేట ఎస్ఐ గోపతి సురేశ్, సీసీసీ ఎస్ఐలు ఉపేందర్, జితేందర్, మంచిర్యాల టౌన్ ఎస్ఐ తిరుపతిలు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాడిన నాయకుడు మునీర్

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

మందమర్రి టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : దొరల, భూ స్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజా కార్మిక హక్కుల కోసం విద్యార్థి దశ నుంచి పోరాడిన నాయకుడు దివంగత సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు.

ఆదివారం సీపీఐ పార్టీ దాని అనుబంధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ క్లబ్‌లో నిర్వహించిన మునీర్ యాది సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మునీర్‌తో తనకు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. ఈ ప్రాంతంలో సింగరేణిలో యూనియన్ అభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు. అనంతరం సలేంద్ర సత్యనారాయణ, భీమనాతుని సుదర్శన్ మాట్లాడారు. అంతకు ముందు మునీర్ చిత్రపటానికి స్థానిక జర్నలిస్టులు, యూనియన్ నాయకులు పూల మాల వేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యోరు కిష్టయ్య, మల్లేష్, యాది రెడ్డి, సోమశెట్టి రాజేషం, అక్బర్‌అలీ, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. సభకు సలేంద్ర సత్యనారాయణ, అధ్యక్షత వహించారు.

ఆటో స్టాండ్‌కు స్థలం కేటాయించే వరకు ఆందోళనలు చేస్తాం

బెల్లంపల్లి, జూన్15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆటో స్టాండ్ల కోసం స్థలం కేటాయించే వరకు ఆందోళనలు చేస్తామని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకొని ప్రయాణికులను వివిధ మండలాలకు చేరవేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఆటో స్టాండ్‌కు చెందిన పలు వివాదాలకు చోటు చేసుకుంటుందని పేర్కొన్నారు. కొందరు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆటో స్టాండ్‌కు సంబంధించిన స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్థలాన్ని మంజూరు చేసి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని సూచించారు. నేడు ఆటో స్టాండ్ సమస్యపై కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు కావున ప్రతి ఒక్క ఆటో డ్రైవర్లందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఆటోయూనియన్ నాయకులు

పోగొట్టుకున్నా..పట్టేస్తారు..

- సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్లను పట్టుకుంటున్న పోలీసులు
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

బెల్లంపల్లి, జూన్15 (ఆంధ్రజ్యోతి): ఫోన్ పోగొట్టుకున్నారా అయితే భయపడాల్సిన పనేమిలేదు. వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయండి సాధ్యమైనంత త్వరలో పోలీసులు ఫోన్ మీ చేతికి అందేలా పోలీసులు చర్యలు చేపడుతారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్(సీఈఐఆర్)పోర్టల్ ద్వారా పోలీసులు పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి రికవరీ చేస్తున్నారు. ఇలా ఏడాది కాలంలో జిల్లాలోని పలు పోలీసు స్టేషన్‌లో దాదాపు 500లకు పైగా పోగొట్టుకున్న ఫోన్లను సంబంధిత యమానులను అప్పగించారు.

● టెక్నాలజీ సాయంతో రికవరీ..

ఎవరైన ఫోన్‌పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేస్తే పోలీసులు టెక్నాలజీ ఆధారంగా ఫోన్లను రికవరీ చేస్తున్నారు. మొదటగా సీఈఐఆర్ పోర్టల్‌ను ఆయా పోలీసు స్టేషన్‌లకు అనుసంధానించారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌లో సైబర్‌క్రైం పోలీసు స్టేషన్ వీటన్నింకి నోడల్ కార్యాలయంగా పని చేస్తోంది. ఈ పోర్టల్‌లో క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడుస్తుంది. పోగొట్టుకున్న బాధితుడు తమ ఫోన్‌నెంబర్ ఐఎంఈఐ నెంబర్ ఆధార్‌కార్డుల వివరాలతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగానే ఈ వివరాలన్నీ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఫోన్ మరొకరికి చేరి కొత్త సిమ్‌కార్డు వేయగానే ఆ వివరాలు పోర్టల్‌లో ప్రత్యక్షమవుతాయి. అవతలి వ్యక్తి సిమ్‌లు మార్చితే అన్ని వివరాలు కనిపిస్తారు. సదరు ఫోన్లు ఎవరి చేతిలో ఏ రాష్ట్రంలో ఉందనే వివరాలన్నీ తెలిసిపోతాయి. పోలీసులు వాటిని రికవరీ చేసి కేసు నమోదు అయిన స్టేషన్‌కు రప్పిస్తారు. ఫిర్యాదు చేసిన బాధితులకు పోలీసులు ఫోన్లను అందేస్తున్నారు.



సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారికి ఫోన్‌లను అందజేస్తున్న ఏసీపీ(ఫైల్)

పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేయాలి..

రవికుమార్, ఏసీపీ బెల్లంపల్లి



ఎవరైన తమ ఫోన్‌పోగొట్టుకున్న దొంగతనానికి గురైన సంబంధిత పోలీసుస్టేషన్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలి. సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించి ఫోన్‌లను రికవరీ చేసి పోగొట్టుకున్నవారికి అందజేస్తాం. ఫోన్ పోతే బాధపడాల్సిన అవసరం లేదు. రూ.10 వేల ఫోన్ నుంచి లక్ష రూపాయల విలువ గల ఫోన్‌లు సైతం పోగొట్టుకున్న బాధితులకు అందజేశాం. ఫోన్ కొనుగోలు చేసిన సమయంలో ఫోన్ ఐఎంఈఐ నెంబర్‌ను భద్రపరుచుకోవాలి.

నేటి నుంచి 'రైతునేస్తం'

- జిల్లాలో నేడు 26 చోట్ల ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నెన్నెల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సాగు రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, ఆవిష్కరణలు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం రైతువేదికల్లో రైతు నేస్తం పేరిట వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించనుంది. సోమవారం జిల్లాలోని 26 రైతు వేదికల్లో ఈ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మొదటి విడతలో జిల్లాలో 17చోట్ల ప్రారంభించగా రైతుల నుంచి మంచి స్పందన లభించింది. మిగతా చోట్ల కూడా రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎల్‌ఈడీ టీవీ, సౌండ్‌బాక్స్‌లు, ఇతర సామగ్రి, హైస్పీడ్ ఇంటర్‌నెట్ సమకూర్చింది. రైతునేస్తం ప్రారంభం కోసం రైతువేదికల్లో అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఇక జిల్లాలోని మొత్తం 43 రైతువేదికల్లో ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం కొనసాగుతుంది. వ్యవసాయ అనుబంధమైన ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, పట్టుపరిశ్రమ, నీటిపారుదల శాఖలకు సంబంధించి శాస్త్రవేత్తలు, నిపుణులు, ఉన్నతాధికారులు రైతులకు ఆన్‌లైన్‌లో అందుబాటు లోకి వచ్చి సలహాలు, సూచనలు ఇస్తారు. రైతులతో ముఖాముఖి ఏర్పాటు చేస్తారు.



నెన్నెల రైతు వేదికలో రైతు నేస్తం కోసం ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్

సద్వినియోగం చేసుకోవాలి

సురేఖ, ఏడీఏ, భీమిని



రైతులకు సకాలంలో అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు ఒక వేదిక ఉండాలనే లక్ష్యంతో రైతువేదికల్లో రైతు నేస్తం పేరిట వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రతి మంగళవారం నిర్వహించే కార్యక్రమంలో నిపుణులు, శాస్త్రవేత్తలు సూచనలు ఇవ్వడంతో పాటు రైతుల నుంచి కూడా అభిప్రాయాలు స్వీకరిస్తారు. పంటల సస్యరక్షణ, తెగుళ్ల నివారణ తదితర అంశాలతో పాటు రైతులకు అందజేస్తున్న బీమా, పంట రుణాలు, రైతు భరోసా తదితర పథకాల గూర్చి వివరిస్తారు. పథకాలపై రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. రైతునేస్తాన్ని అన్నదా తలు సద్వినియోగం చేసుకోవాలి.

రైతు భరోసా ప్రారంభానికి హాజరుకానున్న ఎమ్మెల్యే

తాండూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో సోమవారం రైతు భరోసా ప్రారంభ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వినోద్ ప్రారంభిస్తారని మండల వ్యవసాయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో రైతు భరోసా ప్రారంభ కార్యక్రమం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తారన్నారు.

కాసిపేట: సోమవారం మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతు వేదికలో రైతు భరోసా ప్రారంభ కార్యక్రమం ఉంటుందని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా కార్యక్రమాన్ని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సోమవారం లాంచనంగా ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రైతు వేదికలో దృశ్యశ్రవణ ప్రత్యేక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. రైతులందరూ హాజరు కావాలన్నారు.

జైపూర్ : జైపూర్ మండలంలోని రైతు వేదికల్లో సోమవారం రైతు భరోసా ప్రారంభ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుందని మండల వ్యవసాయాధికారి మార్క్ గ్లాడ్‌స్టన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇందారం, జైపూర్, శెట్‌పల్లి క్లస్టర్లలోని రైతు వేదికల్లో ఉంటుందన్నారు.

మందమర్రిరూరల్: సండ్రోన్‌పల్లి, బొక్కలగుట్ట గ్రామాల్లోని రైతు వేదికల్లో సోమవారం సాయంత్రం రైతు భరోసా కార్యక్రమం వీడియోకాన్ఫరెన్స్ ఉంటుందని ఏఈవో ముత్యం తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పథకంలో నమోదు కాని రైతులందరు పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డులతో వచ్చి నమోదు చేయించుకోవాలని తెలిపారు.

నేటి నుంచి మారెమ్మ జాతర

కోటపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలపల్లి గ్రామంలో ఆదివాసీల ఆరాధ్య దైవమైన మారెమ్మ, కడువలమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు ఆదివారం అమ్మవారిని పల్లకిలో చెన్నూరు గోదావరి నదికి తీసుకువెళ్లి పుణ్యస్నానమాచరిం పజేశారు. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో సంప్రదాయ బద్ధంగా ఆదివాసీలు దేవతలకు ఆట పాటలతో జాతర నిర్వహిస్తారు. సోమవారం అమ్మవార్లకు బోనాలు, మంగళవారం రథయాత్ర ఉంటుందని ఆలయ పూజారులు వెంకటమ్మ, పంగిడి లచ్చక్కలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని మాజీ సర్పంచు తోట స్రవంతి కోరారు. జాతరకు వచ్చే భక్తులకు పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

- జిల్లాలో లోతట్టు ప్రాంతాలను గుర్తించిన అధికారులు
- ముందస్తు చర్యలకు శ్రీకారం
- శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



కాగజ్‌నగర్‌లో ఆక్రమణకు గురైన ప్రధాన డ్రైనేజీ

కాల్వలకు ముప్పు.. కాలనీలకు ముంపు

చినుకు పడితే చాలు పట్టణవాసుల్లో వణుకు మొదలవుతోంది. వానొస్తే కాలనీలను వరద ముంచెత్తుతోంది. వర్షపునీరు వెళ్లేదారి లేక ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. నాలాలు ఆక్రమణకు గురై క్రమేణ కుంచించు కుపోవడం, పూడిక తొలగించక పోవడమే ఇందుకు కారణం. వానాకాలం ప్రారంభమైనందున మున్సిపాలిటీలు, గ్రామాల్లో అధికారులు అప్రమత్తమై నివారణ చర్యలు చేపడుతున్నారు.

కాగజ్‌నగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలతో వచ్చే వరద ముంపును తప్పించేందుకు అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఇపాటికే అధికార గణం లోతట్టు ప్రాంతాలను గుర్తించారు. ప్రధాన కాల్వలతో ఇండ్లలోకి నీరు వచ్చే అవకాశాలుండటం, ఏటా వర్షాకాలంలో ముంపుకు గురవుతుండటంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు.

● మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్..

జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాల్టీలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. వారం రోజుల క్రితం మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశంలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో నాలుగు లోతట్టు ప్రాంతాలను గుర్తించారు. ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న కాలనీలను గుర్తించారు. ఏటా కొద్దిపాటి వర్షాలు కురిస్తే కాల్వలు నిండి రోడ్డుపైకి నీరు ప్రవహిస్తోంది. ప్రధాన కాల్వల్లో చెత్తాచెదారంతో పాటు పిచ్చి మొక్క లు విపరీతంగా పెరిగాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని కాగజ్‌నగర్ కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉదయం నుంచి ప్రధాన కాల్వలను శుభ్రం చేయిస్తున్నారు. కాగజ్‌నగర్ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మొదలుకొని మార్కెట్ ఏరియా వరకు ఉన్న 30 ఫీట్ల ప్రధాన మురికి కాల్వలో ఉన్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగింపు చేపట్టారు. ఈ మార్గంలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూడా తొలగించాలని నోటీసులను కూడా అందజేశారు. స్థానిక వసుంధర డిగ్రీ కళాశాలను ఆనుకొని ఉన్న ప్రధాన కాల్వ వీఐపీ పాఠశాల వెనుక వైపు నుంచి ఎల్లాగౌడ్ తోట వరకు ఈ కాల్వ ఉంది. ఈ మార్గంలోనే ఫ్రీ జోన్ కావడంతో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్లాగౌడ్ వంతెన సమీపంలో ఇపాటికే మురికి కాల్వలోనే నిర్మాణాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్, టీపీబీవో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని నోటీసులను అందించారు. అలాగే కన్యాక పరమేశ్వరి ఆలయంలో సమీపంలో కూడా వంతెన ఇరుగ్గా ఉండటంతో శుభ్రం చేస్తున్నారు. భారీ వర్షం కురిసిందంటే కాగజ్‌నగర్‌లోని లోతట్టుప్రాంతాలైన సంజీవయ్య కాలనీ, కన్యాక పరమేశ్వరి ఆలయం, రైల్వే ట్రాక్ కాలనీ, సర్‌సిల్క్ కాలనీల్లో వర్షం నీరు వచ్చి చేరుతుంది.



డ్రైనేజీలో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

● మండలాల్లో పరిస్థితిపై సమీక్ష

మండలాల్లో పరిస్థితిపై ఎంపీడీవోలు సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్నరు. కాగజ్‌నగర్ మండలంలో కూడా నీట మునిగే ప్రాంతాలపై కూడా ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెద్దవాగు పరివాహ ప్రాంతాలైన అందవెల్లి, జగన్నాథ్‌పూర్ తదితర ప్రాంతాలు పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీటి వచ్చే అవకాశాలున్నాయి. భారీ వర్షాలు కురిస్తే కుమరం భీం గేట్లు ఎత్తివేస్తే పెద్ద వాగు నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని గుర్తించారు. ఈ మేరకు ముందస్తుగా గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. బెజ్జూరు మండలంలో కుశ్నపల్లి, సోమిని ప్రాంతాల్లో రెండు వాగులు ఉప్పొంగే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలో లోలెవల్ వంతెన ఉన్నాయి. కౌటాల మండలంలో కూడా ప్రాణహిత పొంగి ప్రవహిస్తే వీర్దండి, తాటిపెల్లితో పాటు సమీప గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగే అవకాశాలున్నట్టు అధికారులు అంచనాలు రూపొందించారు. ఇక సిర్పూరు(టి)లో పారిగాం, టోంకిని, వెంకట్రాపేట, కర్జవెల్లి, చీలపెల్లి ప్రాంతాల్లోని చిన్నపాటి వాగులు ఉప్పొంగి ప్రవహించి రాకపోకలు నిలిచే అవకాశాలున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

చర్యలు వేగవంతం చేస్తున్నాం..

- అంజయ్య, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్

వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లోకి నీరు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన ము రికి కాల్వలను శుభ్రం చేయిస్తున్నాం. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగిస్తున్నాం. నీరు నిల్వ ఉండకుండా నేరుగా పోయేందుకు అన్నీ రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఫ్రీజోన్‌లో నిర్మించిన వాటికి కూడా నోటీసులను పంపించటం జరిగింది. అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదు. తొలగిస్తాం. వర్షాకాలం ఉన్న నేపథ్యంలో అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. వార్డుల వారిగా అవగాహన కల్పిస్తున్నాం.

అవార్డు గ్రహీతకు సన్మానం



బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు అశోక్‌ను సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నాగ్‌పూర్‌లో సంత్ కబీర్‌దాస్ జాతీయ పురస్కారం అందుకున్న వాంకిడి మండలానికి చెందిన బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్‌ను ఆదివారం మండల కేంద్రంలోని జైత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ సంఘం నాయ కులు సన్మానించారు. అణగారిన సమాజం కోసం నిరంతరం పనిచేస్తూ వారిని చైతన్య వంతులుగా చేయడానికి అశోక్ మహోల్‌కార్ చేసిన కృషిని పలువురు సంఘం నాయకులు కొనియాడారు. అణగారిన సమాజాభివృద్ధికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా పలువులు కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు జైరాం ఉప్రె, అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి ఉప్రె విజయ్, సమాజ పెద్దలు ఉప్రె రాజేశ్వర్, దుర్గం శ్యాంరావు, సంఘం నాయకులు విలాస్, హంసరాజ్, సందీప్, ప్రతాప్, విలాస్, విఠల్, పాల్గొన్నారు.

గద్దర్ అవార్డు గ్రహీతకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జెండాగూడ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మసాదే లక్ష్మీనారాయణ తెలంగాణ గద్దర్ ఫిలిం జ్యూరీ అవార్డు పొందడంతో ఆదివారం పలువురు అభినందించారు. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన గద్దర్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటిరెడ్డి చేతుల మీదుగా అయన జ్యూరీ అవార్డును అందుకున్నారు. మసాదే బాపు-లక్ష్మీ దంపతుల పెద్ద కుమారుడు మసాదే లక్ష్మీనారాయణ రెండు దశాబ్దలకు పైగా జర్నలిస్టుగా హైద రాబాద్‌లో పని చేస్తున్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

జైనూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండంలంలోని ఉషేగాంలో ఆదివారం సీడబ్ల్యూఎస్ సంస్థ అధ్వర్యంలో ఆదివాసీ మహిళా రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెసర్లు, మినుములు, కందులు తదితర విత్తనాలను పంపిణీ చేశామని ఆ సంస్థ కోఆర్డినేటర్ హన్వతే డిగాంబర్ తెలిపారు. ఈ సందర్భంగా డిగాంబర్ మాట్లాడుదూ తమ సంస్థ అధ్వర్యంలో ఆదివాసీ మహిళా రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంటల సాగులో సేంద్రియ ఎరువులు వినియోగించాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందుర్ అమృత్, రైతులు సూర్యభాన్, భీంబాయి, పారుబాయి, కోఅర్డినేటర్లు జ్యోతిరాం, మేస్రాం రాజారం, నగేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రైతునేస్తం' వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం రైతునేస్తం కేంద్రాలలో సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించనున్నారని జిల్లా వ్యవసాయాధికారి ఆర్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గత ఏడాది 15 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ అనుసందాన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. మిగతా 29 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ అనుసందాన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నిర్వహించనున్నారని పేర్కొన్నారు. 2025 వానకాలం రైతుభరోసా కార్యక్రమం దృశ్య శ్రావణ మాధ్యమం ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందని తెలిపారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా అవగహన కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని మండల వ్యవసాయాధికారి సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రైతువేదికలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భరోసా ప్రారంభోత్సవకార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వినే అవకాశం ఉంటుందని తెలిపారు. మండలంలోని రైతులు లింగాపూర్ రైతువేదిక, కంచన్‌పల్లి రైతువేదికలలో హాజరు కావాలని ఆయన సూచించారు.

నేటి నుంచి విద్యార్థులకు ఎంపిక పోటీలు

లింగాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో 2025-26 ఏడాదిలో 4వ తరగతిలో ప్రవేశాలకు మండలం నుంచి విద్యార్థుల ఎంపిక కోసం సోమవారం నుంచి నుంచి 19 వరకు పోటీలు నిర్వహించనున్నామని ఎంఈవో యం శ్రీనివాస్ తెలిపారు. క్రీడాకారులుగా ఎదగాలనే విద్యార్థులకు ఇది మంచి అవకాశమని చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో చదివి అంతర్జాతీయ స్థాయితో పాటు ఒలింపిక్స్ వంటి మెగా ఈవెంట్‌లో పాల్గొని సత్తాచాటిన క్రీడాకారులు చాలా మంది ఉన్నారని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణ లభిస్తుందనిఎంఈవో సూచించారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో 2025-26 ఏడాదిలో 4వ తరగతిలో ప్రవేశాలకు మండలం నుంచి విద్యార్థుల ఎంపిక కోసం పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి కుడిమెత సుధాకర్ తెలిపారు. నాల్గో తరగతి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో సుధాకర్ సూచించారు.

విశ్వహిందూ పరిషత్ ఆసిఫాబాద్ కార్యవర్గం



విశ్వహిందూ పరిషత్ నూతన కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆసిఫాబాద్ కార్యవర్గాన్ని ఆదివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఆసిఫాబాద్ కార్యదర్శిగా ఆకుల సంతోష్, సహాయ కార్యదర్శిగా ఎం రాజు ఎన్నికయ్యారు. సమావేశంలో ధనుంజయ్, రవిందర్, రాజలింగు, కనక తార, రమేశ్, విపీన్, నవీన్, సింహాద్రీ, మురళీ మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కెరమెరి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామన ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జి థామస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్త ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు.ఈ సందర్భంగా కెరమెరి మండల ఇన్‌చార్జిగా మహేష్, కో ఇన్‌చార్జిగా వెంకటేష్‌లను నియమించారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్, నాయకులు రాజయ్య, సంతోష్, రాంచందర్, శంకర్, అశోక్, సాగర్ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

బెజ్జూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని పాపన్‌పేట గ్రామానికి చెందిన బీజేపి నాయకుడు బుజాడి మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట జాడి తిరుపతి, వసీఖాన్, తిరుపతి, విలాస్, రంగన్న, శేఖర్, దిగంబర్ ఉన్నారు.

ర్యాంక్ సాధించిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న నాయకులు

జైనూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆశాపెల్లి గ్రామానికి చెందిన రాథోడ్ శ్రీధర్, జ్యోతిరాణి దంపతులకు చెందిన కుమార్తె రాథోడ్ శృతిష ఇటీవల విడుదలైన నీట్ ఎంబీబీఎస్ 2025 పరీక్షలో ఎస్టీ క్యాటగిరిలో 288వ ర్యాంక్ సాధించడంతో ఆదివారం పులువురు సన్మానించారు. ఈ మేరకు గ్రామస్థులు, జై సేవాలాల్ లంబాడా సేన రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ కృష్ణ నాయక్, ఉట్నూర్ డిప్యూటి తహసీల్దార్ జాదవ్ భీంరావ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గోర్ ప్రబంధక్ కపీల్ జాదవ్ సదరు విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతు మారుమూల గ్రామానికి చెందిన రాథోడ్ శృతిష నీట్‌లో అల్ ఇండియా ర్యాంక్ సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సవిత రాందాస్, రాంచందర్, రాథోడ్ అక్షయ్, చవ్హాన్ రోహిదాస్, రాథోడ్ కైలాస్ పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరావాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండను తక్షణమే నిలిపి వేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ వద్ద ఈనెల 17న జరిగే మహాధర్నాకు తరలిరావాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి చాంద్‌పా షా, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని అం బేద్కర్‌చౌక్‌లో మహాధర్నాకు సంబందించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్, పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి గ్రామంలో ఆదివారం బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకస్మత్తుగా ఎవరైనా కింద పడిపోయిన, గుండె నొప్పితో బాధ పడుతున్న వారిని సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలబడే అవకాశాలు ఉంటాయిన తెలిపారు. ప్రతి ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్‌నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని కుమరంభీం చౌరస్తాలో గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చన్నారు. 108 వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేయడంతో నిండు జీవితాన్ని కాపాడిన వారమవుతామని చెప్పారు.. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వర్షాలకే రోడ్లు చిత్తడి

» రాకపోకలకు వాహనదారుల అవస్థలు

జైనూర్, జూన్ 15 (ఆంధ్రజోతి): మండలంలోని చిత్తకర్ర గ్రామ పంచాయతీలో చిరు వర్షాలకే రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. చిన్న చినుకులు, భారీ వర్షాలు కురిసాన బురద రోడ్డుపై వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. చిత్తకర్ర గ్రామ పంచాయతీ పరిధిలో తాడిలొద్ది, కిషన్ నాయక్ తండా, చిత్తకర్ర తదితర గ్రామాలున్నాయి. ఈ పంచాయతీలో 120 గిరిజన కుటుంబాలు నివాసిస్తున్నాయి. అందులో జనాభా సుమారు 6 వందలకు పైగా ఉంది. గతంలో ప్రభుత్వం పీడబ్ల్యూటీ మెయిన్ రోడ్డు నుంచి చిత్తకర్ర వరకు రెండు కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేసింది. ఆయా గ్రామాలు లోతైన ప్రదేశాల్లో ఉన్నందున టెండర్ పొందిన కంట్రాక్టర్ ఎలాగోలాగో అతి కష్టంపై వంతెన నిర్మాణం పూర్తి చేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు వాగు దాటేందుకు ఇబ్బందులు తప్పాయి. కానీ మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణం అటవీశాఖ అనుమతులు లేనందును నిలిచిపోయిందని చెబుతున్నారు. దీంతో రోడ్డు పనులు సాగక ఆయా గ్రామాల గిరిజనులు ఏటా వర్షాకాంలో బురదలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. బురద రోడ్డుపై బైక్‌లు, ఆటోలు తరచుగా కూరుకుపోతుండడంతో ప్రయాణికు లకు ఇబ్బందికరంగా మారింది. ఆయా గ్రామాల్లో ఎవరైనా విష జ్వరాల బారిన పడినా అత్యవసర పరిస్థితుల్లో 108 సైతం రాలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు సౌకర్యం లేక పోవడం తో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు సైతం రాకపోకలకు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అవస్థలు పకుండా ఉన్నతా ధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బురదగా మారిన చిత్తకర్ర రోడ్డు

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



పట్టుబడిన నకిలీ విత్తనాలు

వాంకిడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నుంచి అక్రమంగా తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును తనిఖీ చేయగా అనుమానాస్పదంగా ఉన్న సంచిలో ఏడు కిలోల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మహారాష్ట్రకు చెందిన పల్లపు వినోద్ నకిలీ పత్తి విత్తనాలు తరలిస్తున్నట్లు గుర్తించి పట్టుకున్నామన్నారు. విత్తనాల విలువ సుమారు 20 వేల రూపాయల వరకు ఉంటుందని చెప్పారు. విత్తనాలను వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో పంచనామా చేసి వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై పోషెట్టి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

పెంచికల్‌పేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఇద్దరిని ఆదివారం రిమండ్‌కు పంపినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఎల్కపల్లి గ్రామానికి చెందిన రాచకొండ కృష్ణ అనే వ్యక్తి దారి వెంట వెళుతుండగా అదే గ్రామానికి చెందిన ఘనపురం వాసుదేవ్, ఘనపురం రాజ్‌కుమార్ అనే వ్యక్తులు పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని శనివారం దాడి చేశారు. దాడిలో కృష్ణకు తలపై, దవడపై బలమైన గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



చిన్నారులకు పలకలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జోడేఘాట్ ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మోతిరాం అన్నారు. మండలంలో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అలీగూడ, గోగెన్ మోవాడ్, వాడిలొద్ది, దెమ్మడిగూడ, రింగరేట్, అడదస్నాపూర్ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భం గా చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు రామకృష్ణ, నాగోరావు పాల్గొన్నారు.